
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
శనివారం 31 ఆగస్టు 2024



నేడు పింఛన్ల పంపిణీ



కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 30: జిల్లాలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఉదయం 6 గంటల నుంచే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 2,43,240 పింఛన్లకు రూ.103.54 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓర్వకల్లు మండల కేంద్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.



అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

చంద్రబాబుపై కరువుసీమ ఆశలు


- పందికోన రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు పూర్తి చేయాలి
- ఆర్డీఎస్, వేదవతి నిర్మిస్తేనే వలసల నివారణ
- గుండ్రేవులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి
- ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ అభివృద్ధి వేగం పెరగాలి
- ఎన్నికల తర్వాత తొలిసారిగా జిల్లాకు చంద్రబాబు
- నేడు ఓర్వకల్లులో పింఛన్ల పంపిణీ

కర్నూలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమికి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు చారిత్రాత్మక విజయం అందించారు. ఇది కౌరవ సభ.. ప్రజా క్షేత్రంలో గెలిచి గౌరవసభలో అడుగు పెడుతానని శపథం చేసిన చంద్రన్నకు ప్రజలు అండగా నిలిచారు. ఇద్దరు ఎంపీలు, 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించారు. జూన్ 12న సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు సగర్వంగా గౌరవసభ (అసెంబ్లీ)లో అడుగు పెట్టాడు. 2024 ఎన్నికల తర్వాత తొలిసారిగా కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అడుగుపెట్టబోతున్నారు. ఓర్వకల్లు మండల కేంద్రంలో శనివారం జరిగే గ్రామసభలో ఆయన పాల్గొంటారు. లబ్ధిదారులకు నేరుగా పింఛన్లను పంపిణీ చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పడకేశాయి. హంద్రీనీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) రిజర్వాయరు కుడి, ఎడమ కాలువలు పూర్తి చేస్తే 35 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ పత్తికొండ నియోజకవర్గం రైతుల చిరకాల స్వప్నం. దీనిపై దృష్టి సారించాలి. తమరి కృషి ఫలితంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి కేంద్రం ఆమోదముద్ర వేసింది. తక్షణం పనులు చేపట్టాలి. అసంపూర్తిగా ఉన్న ఉర్దూ విశ్వవిద్యాలయం, రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, నంద్యాల, ఆదోని, కర్నూలు మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలి. ఇలా ఎన్నో సమస్యలు జిల్లాను వేధిస్తున్నాయి. శనివారం ఓర్వకల్లు మండల కేంద్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు.

ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

రాష్ట్ర విభజన తరువాత అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిత్యం కరువుతో తల్లడిల్లే మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంగా ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. ప్రధాన కాలువ కోటేకల్లు, కోసిగి, పెద్దకడుబూరు, చిన్నమరివీడు జలాశయాల నిర్మాణాలు చేయాలి. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో చేపట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఆ తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

పందికోన కాల్వలు పూర్తయ్యేదెన్నడో..?



పిచ్చిమొక్కలు, ముళ్లకంపలతో హంద్రీనీవా ప్రాజెక్టు పందికోన కుడి ప్రధాన కాలువ

రాయలసీమ జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంగా హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం (హెచ్ఎన్ఎస్ఎస్) నిర్మించారు. శ్రీశైలం ఎగువన 40 టీఎంసీలు కృష్ణా జలాలు ఎత్తిపోయాలి. జిల్లా వాటాగా 7.5 టీఎంసీలు కేటాయించారు. నందికొట్కూరు, పాణ్యం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. అందులో పందికోన (పత్తికొండ) జలాశయం కుడి, ఎడమ కాలువల కింద 61,394 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. కాలువలు అసంపూర్తిగా వదిలేయడంతో నీళ్లున్నా రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. గత జగన్ ప్రభుత్వం 2020 జూలై 8న తీసుకొచ్చిన జీవో నెం.365 శాపంగా మారింది. కుడి, ఎడమ కాలువలు 35-40 శాతం కూడా పూర్తికాలేదు. రూ.200 కోట్లు ఇస్తే పత్తికొండ, దేవనకొండ, గోనేగండ్ల మండలాల్లో తక్షణం 35 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. అలాగే హంద్రీనీవా నుంచి 68 చెరువులను నింపే ఎత్తిపోతల పథకం సమస్యలను పరిష్కరించి తక్షణమే ఎత్తిపోతలు చేపట్టాలి.

కర్నూలు ప్రజలు 'గుండె'రేవుల...

కేసీ కెనాల్ ఆయకట్టు 2.65 లక్షల ఎకరాలు. 29.5 టీఎంసీలు నికర జలాల వాటా ఉన్నా.. ఆ నీటిని నిల్వ చేసుకునేందుకు జలాశయం లేదు. సుంకేసుల జలాశయం ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2,980 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ రిజర్వాయర్ నిర్మిస్తే.. కేసీ ఆయకట్టుకు సాగునీరు సహా కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు, పులికనుమ, పులకుర్తి లిఫ్టు ద్వారా 1.25 లక్షల ఎకరాల వరకు సాగునీరు ఇవ్వవచ్చు. కర్నూలు నగర ప్రజల తాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతుంది. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు కూడా నీటిని సరఫరా చేయవచ్చు.



హంద్రీనీవా కాలువపై అసంపూర్తిగా వేదవతి స్టేజ్-2 పంప్‌హౌస్

టమోటా ప్రాసెసింగ్ పరిశ్రమ కలేనా?



జిల్లాలో 3 వేల హెక్టార్లలో టమోటా సాగు అవుతోంది. పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, ఆస్పరి, దేవనకొండ, ప్యాపిలి, డోన్ మండలాల్లో అత్యధికంగా సాగు చేస్తున్నారు. రాష్ట్ర విభజనకు ముందు సుమారు 10-12 వేల హెక్టార్లలో సాగు చేసేవారు. ధరలు లేక రైతులు ఏటా మార్కెట్లో వృథాగా పారబోస్తున్నారు. అన్నదాతలను ఆదుకోవడానికి టమోటా జ్యూస్ లేదా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఇక్కడి రైతులు సంవత్సరాల తరబడి కోరుతున్నారు.



ఓర్వకల్లులోని స్టీల్‌ప్లాంట్

పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టాలి

హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్' అభివృద్ధి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా వెల్లడించారు. 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ఫేజ్-1 కింద 2,621 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఆమోదం తెలపడం అభినందనీయం. పారిశ్రామిక నగరం అభివృద్ధి చేస్తే నాన్ మెటాలిక్ మినరల్, ఆటోమొబైల్, పునరుత్పాదక, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్ వజ్రాలు, బంగారు ఆభరాలు తయారీ, వస్త్ర ఉత్పత్తి.. వంటి రంగాల్లో రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్రం అంచనా వేసింది. కేంద్రంపై ఒత్తిడి పెంచి నీరు, రోడ్లు, రవాణా, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

వీటిపైనా దృష్టిసారించాలి

- కర్నూలు, ఆదోని, నంద్యాల మెడికల్ కళాశాలల పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ప్రధానంగా నిధుల సమస్య వెంటాడుతోంది. నిధులు ఇవ్వాలి.. ప్రత్యేక దృష్టిసారించి ఈ కళాశాల నిర్మాణాలు పూర్తి చేయాలి.
- రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై నిర్మాణం చేపట్టారు. రూసా నిధులు రూ.20 కోట్లు ఇచ్చారు. పునాదులతో పనులు ఆగిపోయాయి.
- డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టారు. ఫేజ్-1 కింద రూ.18 కోట్లు నిధులతో అకడమిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ 75 శాతం, ఫస్ట్‌ఫ్లోర్ 25 శాతం, బాలిక హాస్టళ్లు బేస్‌మట్టం, పిల్లర్ల వరకు నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఇటుక కూడా వేయలేదు.
- ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తామని ప్రతిపక్షత నేతగా చంద్రబాబు ఎమ్మిగనూరు సభలో స్పష్టమైన హామీ ఇచ్చారు. కేంద్రం మెగా టెక్స్‌టైల్ పార్కుకు సానుకూలంగా ఉంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి టెక్స్‌టైల్ పార్కు సహా నేషనల్ యానిమల్ డిసీజ్ కంట్రోల్ సెంటర్, వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.
- ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. అవసరమైన స్థలం కేటాయించి శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలి.
- కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోనిలో నిర్మాణాలు పూర్తైన 21 వేల టిడ్కో ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలి.



మొండిగోడలతో ఉర్దూ విశ్వవిద్యాలయం

కర్నూలు ఏవో విశ్వనాథంపై విచారణకు ఆదేశాలు?

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 30: కర్నూలు మండల వ్యవసాయాధికారి విశ్వనాథంపై రైతుల విజ్ఞప్తి మేరకు విచారణకు ఆదేశించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మిని ఆదేశించినట్లు తెలుస్తోంది. కర్నూలు మండలంలోని కొంగనపాడు, ఎర్రగుడి, రామకృష్ణాపురం, పంచలింగాల తదితర గ్రామాల రైతులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఏవో విశ్వనాథంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఏవో విశ్వనాథం తమకు 2020లో డీలర్ల నుంచి సకాలంలో విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకోలేదని, దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. మరోదారి లేక పత్తి విత్తనాలను తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి పంటలను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఏవోపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మిని వివరణ కోరగా త్వరలోనే అన్ని విషయాలను వెల్లడిస్తామని తెలిపారు.

రేషన్ లబ్ధిదారులకు తీపి కబురు

ఇకపై పంచదార పంపిణీ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 30: రేషన్ లబ్ధిదారులకు సెప్టెంబరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంచదార పంపిణీ చేయనుంది. ఇప్పటికే బియ్యంతో పాటు పంచదార పౌర సరఫరాల గోదాముల నుంచి చౌకదుకాణాలకు చేరుకున్నాయి. జిల్లాలో 1,233 చౌకదుకాణాలు, 6,76,203 కార్డు దారులు ఉన్నారు. సెప్టెంబరు నెల కోటాకు సంబంధించి కర్నూలు జిల్లాకు 10,715.227 టన్నుల బియ్యం, 352.612 టన్నుల పంచదారను కేటాయించారు.

జిల్లాకు ప్రత్యేక అధికారిగా హర్షవర్ధన్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 30: జిల్లా ప్రత్యేక అధికారిగా కే.హర్షవర్ధన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా యంత్రాంగం, ఆయా శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు జిల్లాలో సక్రమంగా అమలు జరిగేలా ఆయన పర్యవేక్షిస్తారు. 2005 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కే.హర్షవర్ధన్ ప్రస్తుతం మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సెక్రటరీగా కొనసాగుతున్నారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యుల నియామకం



పి.శివసుదర్శన్



వై.జయరాజు,

కర్నూలు(లీగల్), ఆగస్టు 30: కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసింది. సోషల్ వర్కర్ బి.సుధారాణి, న్యాయవాదులు పి.శివసుదర్శన్, వై.జయరాజులను సభ్యులుగా నియమితులయ్యారు. వీరు ఈ పదవుల్లో రెండేళ్లు కొనసాగుతారని ఆ సంస్థ తన ఆదేశాల్లో వెల్లడించింది.

800 మంది పోలీసులతో భారీ బందోబస్తు


కర్నూలు, ఆగస్టు 30: సీఎం చంద్రబాబు రాక సందర్భంగా పత్తికొండలో ఏర్పాటు చేసిన బందోబస్తు ఓర్వకల్లుకు మార్చారు. వాతావరణం పరిస్థితులు అనుకూలించకపోవడంతో సీఎం పర్యటన ఓర్వకల్లుకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో పత్తికొండలో ఏర్పాటు చేసిన బందోబస్తు మొత్తం ఓర్వకల్లుకు మా ర్చారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఓర్వకల్లుకు వెళ్లి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు.

బందోబస్తు ఇలా: ఒక అడిషినల్ ఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 43 మంది ఎస్ఐలు, 154 మంది ఏఎస్ఐలు, 247 మంది కానిస్టేబుళ్లు, 28 మంది మహిళా పోలీసులు, 150 మంది హోంగార్డులు, మూడు సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 5 స్పెషల్ పార్టీ బృందాలు ఈ బందోబస్తుకు కేటాయించారు.

సిండికేట్ మాయలో వేరుశనగ రైతు

- ఎమ్మిగనూరు మార్కెట్‌కు రికార్డుస్థాయిలో 23,412 బస్తాలు రాక
- కొన్ని లాట్‌లకు ధర కోడ్ చేయని వ్యాపారులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 30: పంట బాగా పండినా నష్టమే.. పండకపోయినా నష్టమే అన్నట్లు తయారైంది వేరుశనగ రైతు పరిస్థితి. ఆరుగాలం కష్టపడి ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని పంటను సాగు చేసిన రైతుకు మార్కెట్‌లో మాత్రం నిరాశేమిగులుతోంది. దళారులు, వ్యాపారులు సిండికేట్ కావడంతో వేరుశనగ రైతు భారీగా నష్టపోవాల్సి వస్తోంది. చివరకు వారు చెప్పిన ధరకే పంట దిగుబడిని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం రికార్డు స్థాయిలో వేరుశనగ దిగుబడి అమ్మకానికి వచ్చింది. గోనేగండ్ల, గూడూరు, కృష్ణగిరి, దేవనకొండ, ఆస్పరితో పాటు ఆయా గ్రామాలకు చెందిన రైతులు పెద్దఎత్తున వేరుశనగను మార్కెట్‌కు తీసుకొచ్చారు. 23,412 బస్తాలు (7,024క్వింటాళ్లు), ఆముదాలు 108 బస్తాలు (54 క్వింటాళ్లు) వచ్చాయి. దీంతో మార్కెట్ పంట ఉత్పత్తులు, రైతులతో కళకలలాడింది. వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,380, కనిష్ఠ ధర రూ.2,400 పలుకగా, ఆముదాలు క్వింటా గరిష్ఠంగా రూ.5,700, కనిష్ఠ ధర రూ.4900గా పలికాయి.



వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన వేరుశనగను రాసులుపోసిన దృశ్యం

కొన్ని లాట్లకు ధర కోడ్ చేయని వ్యాపారులు

మార్కెట్‌కు పెద్దఎత్తున వేరుశనగను అమ్మకానికి రైతులు తీసుకొచ్చారు. ఇందులో కొంతమంది రైతులకు చెందిన వేరుశనగ లాట్లకు వ్యాపారులు(బయ్యర్స్) కొనుగోలు చేసేందుకు ధర కోడ్ చేయలేదు. దీంతో రైతులు వ్యాపారులు, కమీషన్ ఏజంట్లపై తీవ్ర అసహనం వ్యక్త చేశారు. చిన్న పెండెకల్లుకు చెందిన ఒకరిద్దరు రైతులు కమీషన్ ఏజంట్‌ను, స్థానిక సిబ్బందిని మాసరుకుకు ఎందుకు ధర కోడ్ చేయలేదని ప్రశ్నించారు. గోనేగండ్ల, నెరుడుప్పల, క్రిష్ణగిరి, హెచ్ కైరవాడి, పెండేకల్లు తదితర గ్రామాలకు చెందిన రైతుల సరుకును వ్యాపారులు కొనేందుకు ఆసక్తి చూపకపోవటంతో ఆవేదనకు లోనయ్యారు. మరి కొంతమంది రైతులు వారి కమీషన్ ఏజంట్ల ద్వారా మాట్లాడి వారు అడిగిన ధరకు విక్రయించారు. మరికొంతమంది రైతులు మాత్రం మార్కెట్ ప్లాట్‌ఫారం మీదనే టార్పాలిన్ కప్పి ఉంచారు. మార్కెట్‌లో 16 మంది వ్యాపారులు ఉండగా 13 మంది మాత్రమే టెండర్‌లో పాల్గొనడం అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా రాత్రి ఉన్నట్టుండి ఓ మోస్తారు వర్షం రావటంతో స్వల్పంగా వేరుశనగ బస్తాలు తడిశాయి.

45 బస్తాలు తెస్తే కొనలేదు

ఎకరన్న భూమిలో దాదాపు రూ.60వేలు పెట్టుబడి పెట్టి 45 బస్తాలు వేరుశనగ పండించి మార్కెట్‌కు అమ్మకానికి తెస్తే ఎవరూ కొనేందుకు ధర కోడ్ చేయలేదు. ఏమి చేయాలో అర్థం కావటం లేదు. కమీషన్ ఏజెంట్ ద్వారా ధరకు అడుగుతున్నారు.

\- చిన్న సుధాకర్, హెచ్ కైరవాడి

తప్పని పరిస్థితుల్లో..

మార్కెట్‌కు వేరుశనగ 40 బస్తాలు తెచ్చా. అయితే ఎవరూ అడగలేదు. ఒక వైపు వర్షం కురిసేలా ఉంది. మరోవైపు వెనక్కి తీసుకువెళ్లలేక తప్పని పరిస్థితుల్లో మా దుకాణం యజమాని ద్వారా వ్యాపారిని ఒప్పించి రూ.4వేల ప్రకార ం అమ్ముకున్నాను. ఖర్చులు పెరిగిపోయాయి. ఈ ధరకు అమ్మినా నష్టమే. అయినా అమ్మక తప్పలేదు.

\- గజ్జలన్న, రైతు, సనగండ్ల

సీఎం చంద్రబాబు పర్యటనలో మార్పులు

ఓర్వకల్లులోనే గ్రామసభ



ఓర్వకల్లు/కర్నూలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ఓర్వకల్లుకు రానున్నారు. ఓర్వకల్లులో ఆయన లబ్ధిదారులకు నేరుగా పింఛన్లను అందజేయనున్నారు. గ్రామ నడిబొడ్డున ఉన్న రచ్చకట్ట వేదికగా గ్రామ సభ నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఓ వైపు వర్షం కురుస్తున్న ప్పటికీ ఏర్పాట్లు, బందోబస్తుపై సమీక్షించారు. షెడ్యూల్ ప్రకారం పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయలమడ గ్రామంలో సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. సీఎం రాక కోసం గ్రామ సభ ఏర్పాట్లు, హెలీప్యాడ్ నిర్మాణం చేశారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో పుచ్చకాయలమడ గ్రామ సభను దిగ్విజయం చేసేందుకు టీడీపీ శ్రేణులు కసరత్తు చేశాయి. అయితే శనివారం సాయంత్రం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉండటం, ఎడతెరిపి లేని వర్షం పడింది. దీంతో ఓర్వకల్లు నుంచి పత్తికొండకు హెలికాప్టర్ వెళ్లేందుకు సీఎం భద్రతా అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం పక్కనే ఉన్న మండల కేంద్రమైన ఓర్వకల్లును ఎంపిక చేశారు. జిల్లాలో 2.45 లక్షలు వివిధ రకాల పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం చంద్రబాబు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పింఛన్ల పంపిణీ గ్రామ సభా వేదిక ఓర్వకల్లు రచ్చకట్ట వద్దకు చేరుకుంటారు. అక్కడే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేస్తారు. అనంతరం గ్రామ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

ఓర్వకల్లు, ఆగస్టు 30: జిల్లాలో శనివారం ఓర్వకల్లు మండల కేంద్రంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్న సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఎస్పీ వెంట ఇంటెలిజెన్స్ అధికారులు, డీఎస్పీలు బాబు ప్రసాద్, కృష్ణమోహన్, శ్రీనివాసరావు, సీఐలు చంద్రబాబు నాయుడు, ప్రసాద్, ఎస్‌ఐలు మల్లికార్జున, సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

ఆరు బైక్‌లు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

ఓర్వకల్లు, ఆగస్టు 30 : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న దొంగను ఓర్వకల్లు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, గ్రామీణ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్‌ఐ సునీల్ కుమార్ ముద్దాయి వివ రాలను వెల్లడించారు. నంద్యాల నగరం బాలాజీ కాంప్లెక్స్‌కు చెందిన షేక్ మహ మ్మద్ వలి అనే వ్యక్తి బైకు దొంగతనాలే వృత్తిగా ఎంచుకున్నాడు. మండల పరిధి లోని సోమయాజులపల్లె సమీపంలోని బేతంచెర్ల క్రాస్‌రోడ్డు వద్ద అనుమా నాస్పదంగా తిరుగుతున్న మహమ్మద్ వలిని పోలీసులు అదుపులోకి తీసుకు న్నారన్నారు. ముద్దాయిని విచారణ చేసి రూ.2.80 లక్షల విలువ గల ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో నాటుసారా, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

పెద్దహోతూరులో చోరీ

ఆలూరు, ఆగస్టు 30 : ఆలూరు మండలం పెద్ద హోతూరు గ్రామంలో గురువారం రాత్రి మాల తిక్కయ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి 4 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ.60వేల నగదు అపహరించుకుపోయారు. మాల తిక్కయ్య కడపలో పని చేసేందుకు వెళ్లగా దొంగలు పడ్డారు. శుక్రవారం ఆలూరు పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహులు తెలిపారు.

అలా.. దొరికిపోయాడు..

- ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు వసూలు
- ధర్మవరం రైల్వే స్టేషన్‌లో గుర్తింపు
- పోలీసులకు అప్పగించిన బాధితుడు



పోలీసుల అదుపులో ఉన్న ఉపేంద్ర

ధర్మవరం, ఆగస్టు 30: ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తి అనుకోని విధంగా బాధితుడికి పట్టుబడ్డాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం కనిపించిన మోసగాడిని బాధితుడు పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన నరేశ్ పట్టుకుని, పోలీసులకు అప్పగించాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరేశ్ బీటెక్ చదివి, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి చెందిన వడ్డే ఉపేంద్ర ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మి నరేశ్ రూ.1.50 లక్షదాకా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అప్పట్నుంచి ఉపేంద్ర తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పనినిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లడానికి కుటుంబసభ్యులతో నరేశ్ శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ ఉపేంద్ర కనిపించడంతో చాకచక్యంగా పట్టుకుని, రైల్వేపోలీసుల వద్దకు తీసుకెళ్లాడు. వారి సలహా మేరకు టూటౌన్ పోలీసులకు అప్పగించాడు. ఉపేంద్ర 20 మంది నిరుద్యోగుల నుంచి రూ.50లక్షలదాకా వసూలు చేసినట్లు తెలుస్తోంది. అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరెవరి నుంచి ఎంత డబ్బు వసూలు చేశాడోనన్న వివరాలు రాబడుతున్నట్లు తెలుస్తోంది.

2,621 ఎకరాలు.. రూ.2,786 కోట్లు..!

- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మంచి రోజులు
- 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధికి అవకాశాలు
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

కల్లూరు, ఆగస్టు 30: ఓర్వకల్లు మండలంలో 2,621 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్‌లో భాగంగా మొదటి దశగా రూ.2,786 కోట్ల నిధులను ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపు చేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ హబ్‌గా ఓర్వకల్లు మండలం రూపురేఖలు మారబోతున్నాయని ఆమె హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తన స్వగృహంలో ఆమె టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ కర్నూలు జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలో వ్యవసాయానికి ఆమోదయోగ్యం కాని 33 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి సీఎం చంద్రబాబునాయుడు ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌కు శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సోలార్ పరిశ్రమ, జయరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ, ఎయిర్‌పోర్టు, డీఆర్‌డీఓ లాంటి పరిశ్రమలు తీసుకువచ్చారని అన్నారు. గత వైసీపీ హయాంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ధ్వంసం చేయడం, స్థలాలు కబ్జా చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించిన ఎయిర్ పోర్టుకు మళ్లీ పునఃప్రారంభించడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం సహకారం మరువలేనదన్నారు. జూలై 23న ఓర్వకల్లును ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ప్రకటించారని అంతేకాకుండా 2,621 ఎకరాల్లో రూ.2,786 నిధులు బడ్జెట్‌లో విడుదల చేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుతో 45 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, బీజేపీ నాయకులు గంగాధర్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షు రాలు కె.పార్వతమ్మ, కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, కల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజ నేయులు, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, తడకనపల్లె సర్పంచు సహారాబి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మూడు బైకులు సీజ్



మద్యం బాక్సులను చూపిస్తున్న పోలీసులు

కోసిగి, ఆగస్టు 30: మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నదీతీరాన ఉన్న రామలింగేశ్వరస్వామి ద్వారం దగ్గర 30 బాక్సుల అక్రమ కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ ఎస్.మహబూబ్‌బాషా, ఎస్‌ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజామున కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన వీకే నరసింహులు, కాకంగారి జగదీష్, తలారి గంగన్న మూడు బైకులపై ఒక్కొక్కరు పది బాక్సుల ప్రకారం మొత్తం 30 బాక్సుల్లో 2,880 టెట్రా మద్యం ప్యాకెట్లను తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకుని మూడు బైకులను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు మధుసూదన్, నాగరాజు ఉన్నారు.

వ్యక్తి అరెస్టు, బైక్ సీజ్

మంత్రాలయం, ఆగస్టు 30: మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం బైక్‌పై తెస్తుండగా.. మాధవరం ఎస్‌ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ గురుమూర్తిలు దాడులు చేసి పట్టుకున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు చెందిన గద్వాల సైఫుల్లా అనే వ్యక్తి తన మోటారు సైకిల్‌పై 90 ఎంఎల్ 260 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా.. పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాయి ఈశ్వరుడి హత్య కేసు...

- హైకోర్టులో విట్నెస్ రీకాల్ పిటిషన్
- చికెన్ బాషా, 'బైరెడ్డి' సంభాషణలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి
- సెప్టెంబరు 5కు విచారణ వాయిదా

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ సాయి ఈశ్వరుడు 2014లో దారుణంగా హత్యకు గురయ్యారు. ఆ కేసులో ప్రధాన నిందితుడు చికెన్ బాషా, ఏ 5గా ఉన్న వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ రికార్డును సాక్ష్యంగా పరిగణించాలని కోరుతూ దాఖలు చేసిన విట్నెస్ రీకాల్ పిటిషన్‌ను విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. దానిని సవాల్ చేస్తూ మృతుడి కుమార్తె జ్యోతి హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. పిటిషనర్ తరపు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 'హత్య కేసులో నిందితులుగా ఉన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, చికెన్ బాషాల మధ్య జరిగిన ఫోన్ సంభాషణను పరిగనణలోకి తీసుకోవాలని కోరుతూ సీఆర్‌పీసీ సెక్షన్ 311 ప్రకారం విట్నెస్ రీకాల్ పిటిషన్ దాఖలు చేశాం. హత్యకేసుపై విచారణ జరుపుతున్న విజయవాడలోని ప్రత్యేక కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. మృతుడి కుమార్తెగా రీకాల్ పిటిషన్ దాఖలు చేసే అధికారం పిటిషనర్‌కు ఉంటుంది. కేసులో విచారణ పూర్తి అయ్యి, తీర్పు వెల్లడించేలోపు సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచేందుకు చట్టంలో వెసులుబాటు ఉంది. అందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను కోర్టు ముందు ఉంచుతున్నా. నిందితుల మధ్య జరిగిన ఫోన్‌కాల్ సంభాషణను సాక్ష్యంగా నమోదు చేసేందుకు సాక్ష్యాల నమోదు ప్రక్రియను తిరిగి తెరిచేలా విజయవాడ కోర్టును ఆదేశించండి' అని కోరారు. నిందితుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తరపు న్యాయవాది యు.ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.... 'విజయవాడ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ రివ్యూ పిటిషన్ దాఖలు చేసే అధికారం పిటిషనర్‌కు లేదు. సాక్ష్యాలను ప్రాసిక్యూషన్ ద్వారా మాత్రమే కోర్టు ముందు ఉంచాలి. నిందితుల మధ్య జరిగిన సంభాషణగా చెబుతున్న ఫోన్ కాల్ ఆడియోను కోర్టు ముందు ఉంచే విషయంలో చట్టం నిర్దేశించిన విధానాన్ని పిటిషనర్ అనుసరించలేదు. కేసు విచారణ తుదిదశకు చేరిన ఈ దశలో సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచేందుకు నిబంధనలు అనుమతించవు' అని పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు సమయం ముగియడంతో వాదనలు కొనసాగింపు కోసం విచారణను సెప్టెంబరు 5కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఆమేరకు ఉత్తర్వులు ఇచ్చారు.

విచ్చలవిడిగా బయో మందులు!

పోలీసుల దాడుల్లో వెలుగు చూసిన అక్రమ వ్యాపారం



బయో మందుల కేంద్రాన్ని సీజ్ చేసిన పోలీసులు

ప్యాపిలి, ఆగస్టు 30: మండలంలోని వెంగళాంపల్లి గ్రామం సమీపంలోని ఓ తోటలో బయో మందుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పారు. అనంతపురం జిల్లా రాయలచెరువుకు చెందిన ఓ వ్యాపారి వైసీపీ నేత అండదండలతో ఈ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నిషేధిత మందులను తయారు చేసి దోపిడి చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బయోమందుల తయారీ కేంద్రంపై దాడులు చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అని చెబుతున్నా అక్కడ వివిధ రకాల కెమికల్స్ ఉండడంతో నిషేధిత బయో మందుల తయారీ జరుగుతున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తయారీ కేంద్రంలో నిల్వ ఉంచిన బయో కిమికల్ మందులను, రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకు స్టేషన్‌కు తరలించారు. ఈ మందులను వ్యవసాయశాఖ ల్యాబ్‌కు పంపనున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. గత ఐదేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం ఉందని ఆయన చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి ఈ అక్రమ వ్యాపారంలో ఎవరున్నది గుర్తిస్తామని, దీనివెనుకాల ఎంతటి వారున్న కేసులు నమోదు చేస్తామని సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

కోసిగి, ఆగస్టు 30: కోసిగి మండల పరిధిలోని గౌడుగల్లు చెరువు సమీపంలో పెద్దకడుబూరు మండలం పీకలబెట్ట గ్రామానికి చెందిన మహేంద్ర అనే రైతుకు చెందిన 20 గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. దాదాపు రూ.2.50 లక్షలు నష్టం జరిగినట్లు రైతు మహేంద్ర తెలిపారు. శుక్రవారం సాయంత్రం గౌడుగల్లు చెరువు సమీపంలో గొర్రెలు మేపడానికి వెళ్లగా.. 5 గొర్రెలు, 15 గొర్రె పిల్లలు ఒక చోట ఉంచడంతో అక్కడ ఎవరూ లేకపోవడంతో మూడు కుక్కలు వాటిపై దాడి చేసి చంపేసినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

ధాన్యం వ్యాపారి కుచ్చుటోపి

- రూ.3కోట్ల వరకు రైతులకు అప్పులు
- ఐదు రోజుల క్రితం పరారైన వైనం

కొలిమిగుండ్ల, ఆగస్టు 30: రైతుల నుంచి ధాన్యం సేకరించి, రూ.3కోట్ల వరకు అప్పులు చేసి ఓ వ్యాపారి ఉడాయించిన ఘటన కొలిమిగుండ్ల మండలంలో వెలుగు చూసింది. మండలంలోని తిమ్మనా యినిపేట గ్రామంలో గత 20ఏళ్లుగా నివాసం ఉంటూ ధాన్యం వ్యాపారం చేస్తున్న కోటేశ్వర రావు గత ఐదు రోజులుగా ఊరు విడిచి వెళ్లడంతో రైతులు లబోదిబో మంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించిన అప్పులు రూ.3కోట్లు ఉన్నట్లు స్థానికులు అంచనా వేస్తున్నారు. మండలంలోని మీర్జాపురం, నందిపాడు, కల్వటాల, నాగిశెట్టిపల్లె, తిమ్మనా యినిపేట తదితర గ్రామాల రైతుల నుంచి ధాన్యంతోపాటు, అప్పుగా సేక రించిన బకాయిలు రూ.3కోట్లు పైగానే ఉంటుందని రైతులు పేర్కొం టున్నారు. అప్పులు చెల్లించే సమయం దగ్గర పడటంతో కోటేశ్వరరావు ఐదు రోజుల క్రితం అర్ధరాత్రి సామగ్రితో ఉడాయించినట్లు స్థానికులు తెలి పారు. కోటేశ్వరరావు కనిపించకుండా పోవడం, కుటుం సభ్యులకు సం బంధించిన ఫోన్లు పని చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థి బస్సు రాకపోకలకు ఇబ్బందులు

- రహదారి పక్కనే అడ్డుగా గోడ నిర్మాణం



బస్సు రాకపోకలకు అడ్డుగా మారిన గోడ

కొలిమిగుండ్ల, ఆగస్టు 30: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో రహదారి పక్కనే ఓ ఇంటి యజమాని గోడ కట్టడంతో విద్యార్థి బస్సు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌కు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ కొలిమిగుండ్ల నుంచి, ఇటిక్యాల, చింతా లాయపల్లె మీదుగా ఉమ్మాయిపల్లె వరకు విద్యార్థి బస్సును ఏర్పాటు చేసింది. ఐదు గ్రామాలకు చెందిన సుమారు 60మంది విద్యార్థులు ఈ బస్సులో మోడల్‌స్కూల్‌కు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. అయితే విద్యార్థి బస్సు మాత్రమే రాకపోకలు సాగించే ఈ రహదారిలో చింతలాయపల్లె గ్రామంలో ఓ వ్యక్తి రహదారి పక్కనే గోడ కట్టడంతోపాటు, రహదారిలో వాహనాలను అడ్డుగా పెట్టి, బస్సు రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాడని విదార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ప్రజలు ఫిర్యాదు చేశారు.

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ నిరసన

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 30: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనైటెడ్ పెన్షన్ స్కీం విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం ముందు యూటీఎఫ్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నూతన పెన్షన్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యంగా లేదన్నారు. పెన్షన్ పొందడానికి 20 సంవత్సరాలు సరిపోతుందన్నారు. కొత్త విధానంలో మాత్రం 25 ఏళ్ల సర్వీస్‌గా నిర్ణయించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూఆర్‌ఏ రవికుమార్, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యేహోషువ, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా నాయకులు తిమ్మన్న, దుర్గాప్ర సాద్, మారెప్ప, హనుమంతు, కాంతారావు, సోమన్న, హనుమన్న పాల్గొన్నారు.

బొలెరోను ఢీకొన్న లారీ

మహిళకు గాయాలు

ఆస్పరి, ఆగస్టు 30 : మండలంలోని బినిగేర గ్రామ సమీపంలో ఆదోని, పత్తికొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కలో ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని వెనుక వైపు నుంచి ఆదోని నుంచి పత్తికొండ వైపునకు వెళ్తున్న లారీ బొలెరోను శుక్రవారం ఢీకొంది. బొలెరో వాహనంలో ఉన్న దుర్గ అనే మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపారు.

జీఎన్‌ఎం పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్..!

నర్సింగ్ ట్యూటర్ల తొలగింపు



జీఎన్‌ఎం పరీక్షలను తనిఖీ చేస్తున్న సీఎస్‌ఆర్‌ఎంవో

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 30: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జరుగుతున్న జీఎన్‌ఎం నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోంది. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు ఈ పరీక్షలను కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుంచి 50 నర్సింగ్ స్కూల్స్ నుంచి విద్యార్థులు సుమారు 400 నుంచి 470 మంది హాజరవుతున్నారు. అయితే రెండు రోజులుగా ఈ పరీక్షల్లో కొందరు విద్యార్థులు మైక్రోజిరాక్స్ పేపర్లను చూసిరాస్తున్నట్లు సమాచారం. ఇందుకు అధికారులు కొందరు ఇన్విజిలేటర్లు, నర్సింగ్ ట్యూటర్లు, మాస్ సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షలకు సంబంధం లేని ఓ క్లర్క్‌కు కాసుల కురిపిస్తున్నాయి. కొన్ని స్కూల్స్ నుంచి పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్యను బట్టి ముక్కు పిండి వసూలుకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి.. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో పరీక్ష కేంద్రాల బయట కుప్పలు కుప్పలుగా మైక్రో జిరాక్స్ చీటీలు పడి ఉండటం చూస్తే మాస్ కాపీయింగ్ ఎంతగా జరుగుతుందో తెలుస్తోంది.

నర్సింగ్ ట్యూటర్ల తొలగింపు



కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రో జిరాక్స్ కాపీలు

మాస్ కాపీయింగ్‌పై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి సాయంత్రం సమీక్ష నిర్వహించారు. నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ వినోదిని, సీఎస్‌ఆర్‌ఎంవో , నర్సింగ్ సూపరింటెండెంట్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. నర్సింగ్ ట్యూటర్లను జీఎన్‌ఎం సప్లిమెంటరీ పరీక్షల నుంచి తొలగిస్తూ సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో స్టాఫ్ నర్సులను ఇన్విజిలేటర్లుగా రోజు మార్చి రోజు వేయాలని నర్సింగ్ సూపరిటెండెంట్ సావిత్రిబాయికి ఆదేశాలు జారీ చేశారు. జీఎన్‌ఎం పరీక్షలకు నలుగురు అధికారులను ఎగ్జామినర్లుగా నియమించారు. సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటేశ్వర్లు, చీఫ్ ఎగ్జామినర్‌గా డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కిరణ్ కుమార్, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ వినోదిని, పరీక్ష ఎగ్జామినర్లుగా సూపరింటెండెంట్ నియమించారు. ప్రతి 45 నిమిషాలకు ఒకసారి అధికారి మారుతూ పర్యవేక్షించాలన్నారు. అలాగే ఈ పరీక్ష కేంద్రాలకు సంబంధం లేని క్లర్కులు వెళ్లకూడదని సూపరింటెండెంట్ హెచ్చరించారు.

ఘనంగా బాలయ్య సినీ స్వర్ణోత్సవాలు


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 30: నగరంలోని జిల్లా టీడీపీ కార్యాల యంలో బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు నందమూరి మోక్షజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. చిత్ర రంగంలో విజయవంతంగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు బాలయ్యకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వేంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మెచ్చిన నాయకులు నందమూరి ఎన్టీఆర్, బాలకృష్ణ అని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి సోమిశెట్టితోపాటు నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు జేమ్స్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రంగస్థల కళాకారుడు మృతి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 30: కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు అక్బర్ బాషా (80) శుక్రవారం ఉదయం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక నగర శివారు ఎన్టీయార్ బిల్డింగ్స్‌లోని స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి. హనుమతంతరావు చౌదరి, కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు ఆయన ఇంటికి వెళ్లి అక్బర్ బాషా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. నటుడు అక్బర్‌బాషా లేని లోటు ఎవరూ పూడ్చలేనిదని, ఆయనతో 1982, 83 ప్రాంతాల్లో కలిసి నటించే అవకాశం తనకు లభించిందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. కర్నూలు కళాకారులు సంఘం ప్రతినిధులు నివాళులు అర్పించారు.

చెట్లను కాపాడుకోవాలి: ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు(అర్బన్), ఆగస్టు 30: చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి పి.శ్యామల, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు కె. వెంకటేశ్వర్లు ప్రసంగించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిచామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ పీవీ సుందరానంద పుచ్చా, నాగరాజు, రాజశేఖర్, అర్షద్, రాంబాబు పాల్గొన్నారు.

● ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మొక్కలను నాటారు. డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలప్ప, లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ శివరాం గౌడ్, శ్వేతారెడ్డి, ప్రభు చరణ్, రేష్మ, రాధా రమణి పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ జి.లాలెప్ప ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రేష్మా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీవీఈవో వైపరమేశ్వరరెడ్డి, డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పాల్గొని కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు.

● బీక్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

గూడూరు: నగర పంచాయతీ పరిధిలోని కర్నూలు రహదారిలో నగర పంచాయతీ చైర్మన్ జె వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు. మున్సిపల్ ఇంజనీర్ సీవీఆర్ వైష్ణవి, సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: గురుకుల పాఠశాలలో ఎంపీడీవో రాముడు శుక్రవారం మొక్కలు నాటారు. ఏపీవో లక్ష్మన్న, ప్రిన్సిపాల్ బలరాముడు, వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు, చింతలయ్య, దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగవాన్ సత్యసాయి సేవలు మరువలేనివి


సత్యసాయి కళామందిర్‌ను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 30: భగవాన్ పుట్టపర్తి సాయిబాబా ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలో నెహ్రూ నగర్‌లోని శ్రీ సత్యసాయి మందిరంలో నూతనంగా నిర్మించిన సత్య సాయి కళామందిర్‌ను టీజీ వెంకటేశ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, మందిరం కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 30: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సెప్టెంబరు 15 వరకు పొడిగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏడీ రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం గుత్తిపెట్రోలు బంకు సమీపంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్యపన్నుల శాఖలో జరుగుతున్న ఆందోళన గ్రహించడంతోపాటు జరిగిన అన్యాయాలకు స్పందించి బదిలీలకు సడలింపు ఇచ్చినందుకు అసోసియేషన్ తరపున చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యదర్శి ఎస్పీ అబ్దుల్ సాహెబ్, సభ్యులు చిక్కండు చంద్రశేఖర్, పి.రమేష్‌బాబు, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కర్నూలు(రూరల్), ఆగస్టు 30: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కార్య దర్శి పీఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు 1, 2 డిపోల్లో శుక్రవారం ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు ఎన్ఆర్ నాయుడు అధ్యక్షతన ధర్నా చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ పాల్గొని ప్రసంగించారు. డ్రైవర్, కండక్టర్లకు నైటవుట్ అలవెన్స్‌లు కలిపి గ్యారేజీ కార్మికులకు నెలసరి ఇన్‌సెంటివ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో డిపో కార్యదర్శులు, ఇసాక్, ఎంఎస్‌బీ రెడ్డి, గ్యారేజీ కార్యదర్శి రవీంద్రబాబు, డిపో కార్యనిర్వాహ క అధ్యక్షులు నారాయణ, బాషా, పీఏ వలి, ఫక్రుద్దీన్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో పాల్గొనండి : టీడీపీ

కర్నూలు(అర్బన్), ఆగస్టు 30: పింఛన్ పంపిణీలో తెలుగుదేశం పార్టీకి చెందిన పత్రి నాయకుడు పాల్గొనాలని ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్‌లు సంయుక్తంగా పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అకెపోగు ప్రభాకర్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. సచివాలయాల పరిధిలో ప్రతి లబ్ధిదారుడి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కల్లూరు, ఆగస్టు 30: నంద్యాల జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపి ఎస్.జే తైక్వాండో అకాడమి క్రీడాకారులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఎస్.జే తైక్వాండో వ్యవస్థాపక అధ్యక్షురాలు నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడాకారులు ఎస్.ఇబ్రహీం, బి.సురేంద్రలను పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అభినందించారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు.



సోలార్ పరిశ్రమకు భూములిచ్చే ప్రసక్తే లేదు

ఓర్వకల్లు, ఆగస్టు 30: సోలార్ పరిశ్రమ ఏర్పాటుకు భూములిచ్చే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. శుక్రవారం మండలంలోని ఉయ్యాలవాడ




అధికారుల వాహనాన్ని అడ్డుకుంటున్న రైతులు

గ్రామంలో భూములను సర్వే చేసేందుకు సర్వేయర్లు సుబ్బారెడ్డి, జయరాముడు వెళ్లారు. భూములను సర్వే చేసేందుకు వెళ్తుండగా.. గ్రామంలో భారీ ఎత్తున రైతులు వారి వాహనాన్ని అడ్డగించి నిరసన తెలిపారు. భూములు సర్వే చేయవద్దని, సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చేప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీంతో సర్వేయర్లు, అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

● ఉయ్యాలవాడ గ్రామంలో గ్రీన్‌కో కంపెనీ చేపట్టే సోలార్ పరిశ్రమ ఏర్పాటును ఇకనైనా మానుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో విలువైన భూములు ఇప్పటికే డీఆర్‌డీవో పరిశ్రమకు ఇచ్చారని, కొండలను చదును చేసుకుని రైతులు భూములను సాగులోకి తెచ్చారని, అలాంటి భూముల్లో సోలార్ పరిశ్రమను ఏర్పాటు చేయడం తగదన్నారు

2 వరకు జనసేన సేవా కార్యక్రమాలు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 30: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం పురస్కరించుకొని నగరంలో శుక్రవారం నుంచి సెప్టెంబరు 2 వరకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ రాయలసీమ జోన్ కన్వీనర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బళ్లారి చౌరస్తాలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.







కృష్ణభగవానుడి గ్రామోత్సవం

ఓర్వకల్లు, ఆగస్టు 30: ఓర్వకల్లులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణ భగవానుడి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామోత్సం నిర్వహించారు. పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, మునిదాసు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

గూడూరు: గూడూరు ఎస్ఐ తిమ్మయ్యను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులు కె.రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. ఈ పౌలు, తెలుగు శ్రీనివాసులు, డాక్టర్ మన్నన్‌బాషా పాల్గొన్నారు.





జి.శింగవరంలో డీవైఎఫ్ఐ ఆందోళన

కర్నూలు(రూరల్), ఆగస్టు 30: కర్నూలు రూరల్ మండలం జి.శింగవరం గ్రామంలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. ఈకార్యక్రమానికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర హాజరై మాట్లాడారు. గ్రామంలో ఉన్న బస్టాండ్ నుంచి కేసీ కెనాల్ వరకు వెంటనే రోడ్డు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి రహదారి పాడైపోయిన ఏఒక్క అధికారి, ప్రజాప్రతినిధి పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. నాయకులు అబ్దుల్లా, ప్రకాష్, సురేష్, నరేష్, వంశీ, అంజి, హరి, రాజు, సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 30: కర్నూలు నగరంలో హంద్రీ నది, కేసీ కెనాల్ పరిరక్షణకు సెప్టెంబరు 9న చేపట్టిన ర్యాలీని జయప్రదం చేయాలని హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బిర్లాగేటు సమీపంలో గల డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి సమావేశ హాలులో రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీ నది, కేసీ కెనాల్ పూర్తిగా కలుషితం అయిందని, కెనాల్‌ను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.





పేదల కోసం నిరంతర పోరాటాలు : సీపీఐ


హనుమప్ప స్థూపానికి భూమి పూజ చేస్తున్న సీపీఐ నాయకులు

మద్దికెర, ఆగస్టు 30: మండలంలోని పేద ప్రజల సమస్యలపై సీపీఐ పార్టీ నిరంతరం పోరాడుతుందని మండల సీపీఐ కార్యదర్శి హనుమప్ప, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు అన్నారు. శుక్రవారం ఎం.అగ్రహారం గ్రామంలో జిల్లా సీపీఐ రైతు సంఘం అధ్యక్షుడు భనుమప్ప స్థూపానికి భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాల వల్ల రైతులు సాగు చేసిన పంటలు చేతికి రాక నష్టపోయారని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. సీపీఐ హనుమప్ప రైతులకు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు.

రెండు మినీ రిజర్వాయర్లు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తుగ్గలి, ఆగస్టు 30: మండలంలో సాగు, తాగు నీరు కోసం రెండు మిని రిజర్వాయర్లు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, మండల కార్యదర్శి సుల్తాన్, వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జొన్నగిరిలో వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు 12 పెద్ద చెరువులు ఉన్నాయని.. వాటికి హంద్రీనీవా ద్వారా నీటిని మళ్లిస్తున్నారని, అయితే.. ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టుల భూములు సాగులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సాగు, తాగు నీరు పుష్కలంగా ఉండాలంటే రాంపల్లి, జొన్నగిరి చెరువులను మినీ రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తే దాదాపు 20 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. శనివారం పుచ్చకాయలమాడ గ్రామానికి పర్యటనకు వచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో రైతులు వరప్ప, రంగారెడ్డి, దేవేంద్ర, పెద్దరంగన్న, తేరప్ప, శ్రీనివాసులు ఉన్నారు.

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని నెలకొల్పాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 30: పత్తికొండ వెనుకబడిన ప్రాంతంలో కార్మికులకు జీవనోపాధి కల్పించే టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని నెలకొల్పాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రంగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ పత్తికొండ ప్రాంతంలో ఏటా విస్తారంగా పండించే టమోటాలకు గిట్టుబాటు ధర లేక రైతులు పారబోస్తున్నారని, రైతులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంతో అటు రైతాంగానికి, ఇటు జీవనోపాధి కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు మాదన్న, అధ్యక్షుడు నెట్టికంటయ్య, గుండు బాషా, రాజప్ప, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి


తుగ్గలిలో ఎంఈవోను కలిసిన టీడీపీ నాయకులు

తుగ్గలి, ఆగస్టు 30: పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని టీడీపీ నాయకులు రాంపల్లి శ్రీనివాసులు, ప్రతాప్ యాదవ్, విద్యాకమిటీ చైర్మన్ చెన్నకేశవులు కోరారు. శుక్రవారం తుగ్గలిలో ఎంఈవో రమా వెంకటేశ్ గౌడును కలిసి సన్మానించారు.

రహదారులు బాగు చేయాలి


కర్నూలు- ఆలూరు రహదారిపై నిరసన తెలుపుతున్న నాయకులు

ఆలూరు రూరల్, ఆగస్టు 30: నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని సీపీఐ ఎంఎల్ లింబరేషన్ పార్టీ ఆలూరు తాలూకా కార్యదర్శి బోయ మునిస్వామి అన్నారు. శుక్రవారం పెద్దహోతూరు-ఆలూరు రహదారిలో సీపీఐ ఎంఎల్ లింబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆలూరు- కర్నూలు రహదారి శిథిలావస్థకు చేరుకుందని పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, పరుశరామ్, రాముడు, దాదాపీర, మస్తాన్ పాల్గొన్నారు.

యజమానిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ తాలుకా కార్యదర్శి ఎం.రాజు

కోసిగి, ఆగస్టు 30: మండలంలోని వందగల్లు గ్రామంలో కల్తీ కల్లుకు విద్యార్థులను బానిసలుగా చేసిన కల్తీ కల్లు యజమానిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ తాలుకా కార్యదర్శి ఎం.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కోసిగిలో ఆయన మాట్లాడుతూ వందగల్లు కేంద్రంగా అక్రమ కల్తీ కల్లు సరఫరా జరుగుతున్నా పోలీసులు, అధికారులు దాడులు చేయడం లేదని అన్నారు. వెంటనే కల్లు దుకాణాలపై దాడులు చేసి సీజ్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, నవీన్ కుమార్, వీరేష్, నాగరాజు, సుందర్‌రాజు తదితరులు ఉన్నారు.

అందరికీ న్యాయం చేయాలి

తుగ్గలి, ఆగస్టు 30: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు కొమ్మె వెంకటేశ్, చంద్రశేఖర్ యాదవ్‌లు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కృష్ణమూర్తిని కలిసి పూలమాల వేసి సన్మానించారు. అలాగే ఎస్ఐకి మండలంలోని పలు సమస్యలను వివరించారు.

రేషన్ బియ్యం తరలించిందెవరు?

● 83 సంచులు రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్టు గుర్తించిన డీలర్లు


గోదాములో ఉన్న రేషన్ బియ్యం

ఆదోని, ఆగస్టు 30: ఆదోని ఎంఎల్ఎస్ గోదాము నుంచి రేషన్ బియ్యం తరలింపు వ్యవహారం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. గోదాము నుంచి 53 సంచుల రేషన్ బియ్యం ఎలాంటి రికార్డులు లేకుండా బయటకు తరలిపోయినట్లు తెలుస్తోంది. ఆదోని మండల లెవెల్ స్టాక్ పాయింట్ నుంచి వెళ్లిన లారీలో అదనంగా రేషన్ బియ్యం సంచులు లోడింగ్ చేసి పంపారు. అదనంగా వేసిన బియ్యాన్ని ఎవరు గుర్తించలేదు. రేషన్ బియ్యం లారీలోడుతో కోసిగి మండలానికి వెళ్లింది. ప్రమాదవశాత్తు గతవారం ఆ లారీ ప్రమాదానికి గురైంది. దీంతో లారీ నుంచి మరో లారీకి మార్చేటప్పుడు రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లు గోదాం కాంట్రాక్టర్ హేమలత గుర్తించారు. లారీతో పాటు ఆమె గుమస్తా దస్తగిరిని పంపించారు. లారీ దిగుబడక ముందే ఒక డీలర్ దగ్గర రేషన్ బియ్యాన్ని దించేసి వెళ్లారు. అక్కడ దాదాపు 60 రేషన్ బియ్యాన్ని అన్‌లోడ్ చేసినట్లు తెలుస్తోంది. సాతనూరులో దించేటప్పుడు మరోసారి 23 ప్యాకెట్లు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఇదేమిటని అడిగితే లోడు చేసేటప్పుడు పొరపాటు జరిగిందని చెప్పుకొచ్చారు. మొత్తంగా 83 ప్యాకెట్లు పైగా లారీలో అదనంగా లోడ్ చేసి పంపించారు. రేషన్ బియ్యంను గోదాం నుంచి ఎవరు ఎవరికి పంపించారు..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. 23 సంచులు దొరికిన వెంటనే ఆ బియ్యాన్ని గోడౌను తరలించారు. ఈ విషయంపై గోదాం ఇన్‌చార్జి రవీంద్రనాథ్ రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. 23 సంచులు అదనంగా వెళ్లింది. వాస్తవమేనని, పొరపాటుగా పంపించారన్నారు. ఇవి మామూలుగా జరుగుతూనే ఉంటుదంటూ వివరణ ఇచ్చారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

● హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య

మంత్రాలయం, ఆగస్టు 30: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి 25వ తేదీలోపు పూర్తి చేయకపోతే ఆ గృహాలు రద్దు అవుతాయని హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన హౌసింగ్ లేఅవుట్స్, అనుమతులు ఉండి సొంతంగా నిర్మించుకున్న గృహాలు ఆయా దశల్లో వున్నాయని, లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయించుకుని వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు పూర్తి చేసి బిల్లులకు ప్రతిపాదనలు పెట్టిన వాటికి మాత్రమే డబ్బులు మంజూరు అవుతాయని తెలిపారు. కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం, కౌతాళం మండలాల్లో 6,950 గృహాలు మంజూరు కాగ,ఆ 3,331 మాత్రమే పూర్తయ్యాయని, మిగతా గృహాలు వివిధ దశల్లో ఉన్నాయనీ అన్నారు. కాంట్రాక్టర్లు సైతం నోటీసులు జారీ చేశామని పనులు ప్రారంభించి గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఆదేశించారు. హౌసింగ్ ఎండీ, జిల్లా కలెక్టర్, జిల్లా పీడీ ఆదేశాల మేరకు వెంటనే నిర్మాణాలు చేపట్టి మార్చి 25వ తేదీలోపు పూర్తి చేసిన ఫైనల్ మొత్తం డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలన్నారు. అలాంటి వాటికి మాత్రమే హౌసింగ్ బిల్లులు మంజూరవుతాయని, కానీ పక్షంలో రద్దు అవుతాయని తెలిపారు. ఇప్పటికే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్స్‌పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని, గ్రామాల్లో ఉన్న లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సర్పంచులు కూడా స్పందించాలని కోరారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి


మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న వీరభద్రగౌడ్

ఆస్పరి, ఆగస్టు 30 : మండలంలోని బినిగేర గ్రామంలో టీడీపీ కార్యకర్త రామాంజినేయులు అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు టీడీపీ సీనియర్ నాయకులు వీరభద్ర గౌడ్ మృతుడి స్వగ్రామం బినిగేరికి శుక్రవారం చేరుకొని మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తలసేమియా బాధితులకు రక్తదానం


రక్తదానం చేస్తున్న గ్రామస్థులు

దేవనకొండ, ఆగస్టు 30 : తలసేమియా బాధితుల కోసం కప్పట్రాళ్లలో రక్తదానం శిబిరం యాంటీనార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ ఐజీ ఆకె రవికృష్ణ పుట్టినరోజు సందర్భంగా గ్రామ ప్రజలు నిర్వహించారు. తాన స్త్రీశక్తి భవనంలో కర్నూలు బ్లడ్ బ్యాంకు వారు రక్తదానం శిబిరం ఏర్పాటు చేయడంతో గ్రామానికి చెందిన 20మంది వ్యక్తులు రక్తదానం చేశారు. ఆనంతరంమొక్కలు నాటారు. సర్పంచు చెన్నమనాయుడు, సేఫ్టీస్ ప్రోగ్రాం మేనేజరు నారాయణ ,గ్రామస్తులు మల్లికార్జున ,మదుసూధన, మద్దయ్య, రవికుమార్, లక్ష్మన్న, సుంకన్న పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 30 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కౌన్సిలర్లు రామదాసు గౌడు, అమానుల్లా అన్నా రు. పట్టణంలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎరుకుల సూరి, డీఈఈ నీరజ, విక్టర్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: పట్టణంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలికలు)లో శుక్రవారం వనం-మనం కార్యక్రమంలో భాగంగా టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు, సీనియర్ నాయకుడు బొమ్మన శివశంకర్‌రెడ్డి మొక్కలు నాటారు. అలాగే జిల్లా పరిషత్ హైస్కూల్(బాలికలు)లో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడివో శివమల్లేశ్వరప్ప, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసూన, చంద్రావతి, టీడీపీ నాయకులు వీరభద్రుడు, ఎర్రబజారు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కర్నూలు ఈఎన్‌టీ వైద్యులు అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు.. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కలశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృపాకర్, మల్లికార్జున, సురేష్, సుమన్ రాజ్ పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 30 : పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని తక్షణమే మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులు ఎప్పుడు కూలుతుందో అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ఉన్నారన్నారు. వెంటనే సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాస్టల్ భవనాన్ని ఇతర చోటికి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్, నాగరాజు, రాజు, మహేష్ గౌడ్, భరత్ పాల్గొన్నారు.

నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాలు


కేక్ కట్ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి, అభిమానులు

మంత్రాలయం, ఆగస్టు 30: మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి నివాసం వద్ద హిందూపురం ఎమ్మెల్యే ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాల సంబరాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన నందమూరి బాలకృష్ణ అభిమానులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు హుశేన్ ఆలం, శంకరప్ప, నరసింహ నాయుడు, బజారి, రెహిమాన్, బసవరాజు, వేమన, లక్ష్మీకాంత్, నూకయ్య, లక్ష్మిరెడ్డి, తిక్కయ్య, రవి, రంగయ్య, రమేష్ పాల్గొన్నారు.

వినాయక చవితికి ఐదు రోజుల అనుమతి ఇవ్వాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 30: పత్తికొండ పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలకు 5 రోజులు అనుమతి ఇవ్వాలని వీహెచ్‌పీ నాయకులు వీర్రాజు, రామలింగయ్య, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు నరేష్, చిన్నలింగమయ్య, బీటీ పవన్, కాంగ్రెస్ నాయకులు క్రాంతి నాయుడు అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఐదు రోజులు ఉత్సవాలకు అనుమతులు ఇవ్వాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వారు మాట్లాడుతూ డివిజన్ స్థాయి అధికారులు ఐదు రోజుల వినాయక ఉత్సవాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు బాలు, వినోద్, మధు, జాఫర్, తేజ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పు మాఫీ చేయిస్తానని.. డబ్బు తీసుకున్నారు

ఎమ్మిగనూరు, ఆగస్టు 30: పట్టణంలోని టౌన్‌బ్యాంకులో తనకున్న అప్పును వన్ టైం సెటిల్‌మెంటు కింద మాఫీ చేస్తామని రూ. 2.80లక్షలు తీసుకొని అప్పు మాఫీ చేయకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ కొమ్ము రాజు, దారాల శీను వేదిస్తున్నారని పట్టణానికి చెందిన సూగూరు నాగేష్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 25ఏళ్ల క్రితం టౌన్ బ్యాంకులో రూ. 75వేలు రుణం తీసుకున్నాను. అటు తరువాత బ్యాంకుకు రూ. 2.50లక్షలు చెల్లించానని, 2019లో 5.80లక్షలు చెల్లించాలని బ్యాంకు అధికారులు చెప్పారన్నారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి బ్యాంకు చైర్మన్ కొమ్ము రాజు తన అనుచరుడైన దారాల శీనును తన దగ్గరకు పంపి వన్‌టైం సెటిల్‌మెంట్ కింత అప్పును మాఫీ చేస్తామని, ఇందుకు గాను బ్యాంకులో కట్టేందుకు రూ. 2లక్షలు, మాకు రూ. 90వేలు ఇవ్వాలని చెప్పడంతో అప్పు తగ్గుతుందని మొదట రూ. 80వేలు మాములు కింద వారికి ఇచ్చామన్నారు. మిగతా రూ. 2లక్షలు తరువాత ఇచ్చాను. ఇలా రూ. 2.80 ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బ్యాంకులో అప్పు మాఫీ చేయలేదన్నారు. కనీసం నా డబ్బు నాకు ఇవ్వాలని అడిగినా ఇవ్వకుండా వేదిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులుకు ఫిర్యాదు చేశానన్నారు.

రాజ్యాంగహక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత


జైభీం ఫౌండేషన్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ, ఆగస్టు 30: రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండలో గురువారం జైభీం ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిని వెంకట్రాముడు, జైభీం అధ్యక్షుడు సోమన్న సభ్యులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న మహానంది

ఆలూరు, ఆగస్టు 30 : ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాలల అందరు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షులు మహానంది పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలూరు గెస్ట్ హౌ స్‌లో జట్టపగారి వీరేశ అధ్యక్షతన మాల మహానాడు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దళితుల ఐక్యతను దెబ్బతీసే విధంగా ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం చాలా విచారకరమని, దీనివల్ల దళితుల మధ్యన చిచ్చుపెట్టే విధంగా ఆ తీర్పు ఉందన్నారు. బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని మార్చే విధంగా రిజర్వేషన్‌లను క్రమబద్ధీకరంగా ఎత్తివేసే విధంగా కుట్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, భరత్, లింగంపల్లి మల్లికార్జున, లక్ష్మన్న, ఈరన్న పాల్గొన్నారు.

ఢిల్లీ జాతీయ న్యాయసదస్సుకు ఆలూరు వాసి మసాల బుజ్జప్ప



ఆలూరు, ఆగస్టు 30 : ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి న్యాయ సదస్సుకు ఆలూరు పట్టణానికి చెందిన పెనుకొండ జూనియర్ సివిల్ జడ్జి మసాలా బుజ్జప్ప ఎంపికయ్యారు. న్యాయ వ్యవస్థ, చట్టాల అమలు వంటి వాటిపై జాతీయ స్థాయి సదస్సులో చర్చ సాగుతుందని ఆయన తెలిపారు. జాతీయస్థాయిలో జరిగే ఈ సదస్సుకు సుప్రీం, హైకోర్టు జడ్జిలు, న్యాయమూర్తులు పాల్గొంటారని తెలిపారు.

సుంకులమ్మ ఆలయానికి పంచలోహ విగ్రహం

మద్దికెర, ఆగస్టు 30: స్థానిక గిడ్డయ్య వీధిలో వెలసిన సుంకులమ్మ అమ్మవారికి పంచలోహ విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. శుక్రవారం అదే వీధికి చెందిన అల్లం నారాయణ స్వామి, సుశీలమ్మ దంపతుల కుమారులైన నాగరాజు, లక్ష్మీ, నరసన్న, హేమలతలు 3 కేజీలు కలిగిన సుంకులమ్మ అమ్మవారి ప్రతిమగల పంచలోహ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ నిర్వాహకులకు అందజేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పుచ్చకాయలమడ గ్రామంలో చంద్రబాబు పర్యటన రద్దు

● రెండురోజులపాటు ఏర్పాట్లు చేసిన అధికారులు

● వాతావరణం అనుకూలించక ఓర్వకల్లుకు మార్పు

పత్తికొండ, ఆగస్టు 30: పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో శనివారం జరగాల్సిన ముఖ్యమంత్రి పర్యటన రద్దయింది. పర్యటనలో భాగంగా ఓర్వకల్లులో విమానం దిగి అక్కడి నుంచి ముఖ్యమంత్రి హెలికాప్టర్‌ద్వారా పుచ్చకాయలమడ గ్రామానికి చేరుకోవాల్సి ఉంది. తుఫాను కారణంగా హెలికాప్టర్‌లో ప్రయాణించడానికి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పుచ్చకాయలమడ పర్యటనను అధికారులు రద్దుచేసినట్లు తెలిసింది. కాగా పుచ్చకాయలమడలో ముఖ్యమంత్రి పర్యటన 29వతేదీ ఉదయం ఖరారు కావడంతో రెండురోజులుగా ఓవైపు జిల్లా అధికారులు మరోవైపు స్థానిక అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రెండురోజులుగా గ్రామంలో పర్యటిస్తూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితర కీలక నాయకులు పార్టీశ్రేణులతో కలసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. కాగా పింఛన్ల పంపిణీకి గ్రామానికి వస్తున్న ముఖ్యమంత్రి పర్యటన వర్షం కారణంగా రద్దుకావడంపై పుచ్చకాయలమడ గ్రామస్థులు నిరుత్సాహానికి గురయ్యారు.

రైతుల కోరికల దినోత్సవాన్ని విజయవంతం చేయండి : రైతుసంఘం


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 30: సెప్టెంబరు 1న నిర్వహించే రైతుల కోరికల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు కారన్న, అధ్యక్ష కార్యదర్శులు వీరన్న, ఉమాపతిలు రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతుల కోరిక దినోత్సవాన్ని సెప్టెంబరు 1న నిర్వహిస్తున్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేదవతి, గుండ్రేవుల, రాజోలిబండ ప్రాజెక్టులను నిధులను కేటాయించాలన్నారు. హంద్రీనీవా ద్వారా 106 చెరువులకు నీళ్ల నింపి పంది కోన రిజర్వాయరు ఎడమ కాలువ పనులు పూర్తి చేసి సాగునీరు అందించి ఆదుకోవాలన్నారు. రైతుల కోరిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీను, లక్ష్మీనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో సత్యసాయి ప్రసాద్, టీడీపీ నాయకులు


మంచాలమ్మ సన్నిధిలో సత్యసాయి ప్రసాద్, టీడీపీ నాయకులు

మంత్రాలయం, ఆగస్టు 30: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ పారిశ్రామికవేత్త సత్యసాయి ప్రసాద్, సీనియర్ టీడీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, గుడిసె కృష్ణమ్మ శుక్రవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఐపీ నరసింహ మూర్తి, నాయకులు ఉలిగయ్య, పల్లేపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, బసలదొడ్డి ఈరన్న,ఎస్ఎం గోపాల్ రెడ్డి, మాలపల్లి లక్ష్మన్న, వడ్డే నారాయణ, అనంత స్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ పాల్గొన్నారు.

● మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. శుక్రవారం ఏకాదశి సందర్భంగా బృందావనంకు నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు.

పాఠశాలకు ఉత్తమ క్రీడా పురస్కారం


కోసిగిలోని బాలుర పాఠశాల పీఈటీ శ్రీరామ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోసిగి, ఆగస్టు 30: కోసిగి బాలుర ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో మూడేళ్లుగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉత్తమ క్రీడా పాఠశాలగా ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం-2024 సందర్భంగా కర్నూలులో ఉత్తమ అవార్డు అందుకున్నామన్నారు. శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాల పీఈటీ శ్రీరాములును పూలమాలలు, శాలువలతో సన్మానించారు. బాలుర పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో జార్ఖండ్ రాష్ట్రంలో రాంచీలో ఖోఖో, కబడ్డీ, త్రోబాల్ పోటీల్లో మూడు పథకాలు రాష్ట్ర స్థాయిలో క్రీడా అసోసియేషన్‌లో నాలుగు పథకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

'దేవనకొండ అభివృద్ధికి వెంకటరత్నం కృషి'


మాజీ సర్పంచ్ విగ్రహవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

దేవనకొండ, ఆగస్టు 30: మాజీ సర్పంచ్ వెంకటరత్నంశెట్టి దేవనకొండను అభివృద్ధి చేశారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆలూరు టీడీపీ సీనియర్ నాయకులు వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం దేవనకొండలో ఆయన విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 30 : పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని తక్షణమే మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులు ఎప్పుడు కూలుతుందో అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ఉన్నారన్నారు. వెంటనే సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాస్టల్ భవనాన్ని ఇతర చోటికి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్, నాగరాజు, రాజు, మహేష్ గౌడ్, భరత్ పాల్గొన్నారు.